వై. సి. వి. రెడ్డి

కథానిక

# ఐదు రూపాయలు

"వానితో ఏం? వాన్ని అంతగా కొట్టకుంటే ఏం? యింతకూ వాడేంచేసినాడు. కాదంటే కష్టకాలాల్లో గింజలో, లెక్కో అప్పు తీసుకొని వుంటాడు. అదైనా ఎక్కువ యిచ్చి టాడా. యీ ముంద మోపి యిచ్చింటే 5, 10 లెక్కో, 10, 15 సేర్ల గింజలో యిచ్చింటాడో లేదో, అంత సంబడానికి యింతగానా కొట్టేది. అయినా యివూరు వూరేకాదు. అందరూ పెద్ద రెడ్లే ఆస్తి కొంచెమూ అహం భావము ఎక్కువా. వాళ్ళకు తెలియదు. ఒకరు సెప్పితే వినరు. ఏమన్నా అంటే "పోరాపోరా మహ తెలిసినోళ్ళవి అని అంటారు. ఈ వూరు బాగుపడుతుందా? ఎట్లబ్బా యీ వూరు బాగుపడేది. 'థూ కొంపలో మానంగా మర్యాదగా బతకాలంటే కుదరనే కుదరదు. ఎక్కడన్నా పోయి బతుకుదామా అంటే కానేకాదు. ఏ వూరికావూరు అగ్గి గుండంగా మండుతా ఉంది. టౌనుకు పోదామా అంటే అక్కడ దిక్కులేని చావు. అక్కడ బతకాలంటే వాటగాడు కావాల. ఎక్కడ ఒరిగినా ఆఫీసర్ల పదును కత్తులు ఒరుసుకొంటాయి. తెలిసీ తెలియకుండా బతకాల. పెట్టుబడి పెద్దగా వుండాల. పెద్ద వ్యాపారముండాల. పెద్దపెద్ద ఆఫీసర్లతో పరిచయాలుండాల. లేకుంటే కుక్క చావు....ఈ అసూయలూ ద్వేషాలూ - రోషాలూ - లోభి గుణాలూ దానికితోడు అహంభావాలూ ఎట్లాపోతాయి. ఎప్పుడు పోతాయి "అని దిక్కుతెలియని స్థితిలో ఆలోచిస్తున్నాడు వాసుదేవరెడ్డి.

వాసుదేవరెడ్డికి బంధువర్గము దండిగా వుంది. అందరూ తన చుట్టూ ఉన్నట్లుంటారు. ఎవరికి సహాయం చేయకపోయినా చిక్కుల్లో పడతాడు. ఎవరికి ఏ సలహా యివ్వాలన్నా కనీసం వారం రోజులైనా ఆలోచించి యివ్వాల. కఠినమైన కావ్యానికి వ్యాఖ్యానమైన చెప్పచ్చుకానీ - కలిసి జీవించే కవలపిల్లల హృదయోల్లాసాలను విడమరచి చెప్పలేము అంతస్థుకు తగిన మర్యాద లేదు. అర్థంకాని బతుకులు. ఒకడు ఏదారి అంటే యింకోడు గోదారి అంటాడు. వాసుదేవరెడ్డికి ఆలోచనల్లో కొడి దొరకలేదు లచ్చిగాన్ని కొట్టింది రెండు రూపాయలకే అని అంటారు. స్వల్ప మొత్తానికే అంతగా కొట్టాలా - లెక్కరాకుంటే ఏమవుతుంది. ఎక్కడికి పోతాడు అని, వస్తుందిలే అని సోకోర్చుకో వచ్చునే. న్యాయం చెపుదామా అంటే ఎవనిక్కా

వాల న్యాయం. జరిగే వాని పక్కనే ఉంటుంది న్యాయం. బీదోళ్ళు ఎవరి దగ్గర న్యాయం పొందుతారు. కోర్టులూ, కచ్చేరీలు వాళ్ళకు దూరం. పనిపోగొట్టు కొని తిండిలేకుండా కోర్టుకు పోలేరు అంతా కరువుతో కూడుకొన్న పని. అక్కడా ఆస్తిపరులదే పైచెయ్యిగా ఉంటుంది. కర్చులు పెట్టుకొంటూ, అందర్నీ మేపుకొంటూ సంవత్సరాల తరబడి వాయిదాలు వేయించుకొంటూరు విచారనే జరగనీరు. పేదోడు కర్చులకు తట్టుకోలేక ఆ వూరు విడిచి పెట్టిపోవాల. అంతే! న్యాయం పేదోని పక్కనఉన్నా-అన్యాయంగా, దిక్కులేకుండా. దొంగతనంగా వూరువిడిచి కానని చోటికి కష్టపడి పోవాల్సిందే. లేకుంటే వాన్ని సర్వనాశనం చేస్తారు. యింతకూ సుకపడే రాతలేదు. తల వేడెక్కిపోయింది. ఆలోచన్లతో. బీడీ ముట్టించుకున్నాడు. ఎవరన్నా అదోవన వస్తారేమో అని చూస్తూ బీడీ తాగుతూ, వసారాలోంచి వచ్చి, పంచటరుగు మీద కూర్చున్నాడు. పేడగంపెత్తుకొని పోతున్న గుర్రప్పను పిలిచినాడు వాసుదేవరెడ్డి.

"వస్తాలేబ్బా" అని పేడదిబ్బలో వేసి వచ్చినాడు గుర్రప్ప.

"గుర్రప్పా!లచ్చిగాని కొట్టినారంటనే ఎందుకూ? 'నేనూర్లోలేను నిజంచెప్పరా" అని అన్నాడు.

"ఏముంది వాడు బాలిరెడ్డికి బాకీ అంట. పనికి పిలిస్తే రాలేదంట. అంతకు ముందే పిలచినోళ్ళకు పనికి పోతుంటే వాళ్ళు తంతారు. వాని వేరే వాళ్ళపనికి పోయినాడు" అని గుర్రప్ప అన్నాడు.

"ఎంతరా బాకీ? ఊరుకూరకనే కొట్టారు." అని కొంచెం విసుగ్గా అడిగినాడు వాసుదేవరెడ్డి.

"యాడిదబ్బా ఐదురూపాయలు బాకీ వున్నాడంట" అని అన్నాడు, గుర్రప్ప.

"రెండు రూపాయలే అని చెప్పినారే" అని అడిగినాడు వాసుదేవరెడ్డి.

"కానోళ్ళు చెప్పింటారు. వాడే నాతో అన్నాడు ఐదురూపాయలు యివ్వాలని, రెండురూపాయలకే యిరగ్గట్టి కొట్టినాడని బాలిరెడ్డిని పది మందిలో చూపించేందుకు అట్లా అని ఉంటారు. ఎట్లయినా పేదోళ్ళదే తప్పు. అప్పు తీసుకోడమేల దెబ్బలు తినడమేల? అని అంటూనే కొట్టడం తప్పు అన్నధ్వని వచ్చేట్లు మాట్లాడినాడు గుర్రప్ప.

"అప్పు తీసుకొంటే - పనికిరాకుంటే అంతగా కొట్టాల్నా. కళ్ళ బెత్తుతో పని జరుపుకోవాల. యిప్పుడు పదిమంది నోళ్ళలో బాలిరెడ్డి నానుతావుండాడు. ఏంపని" అని యీసడింపుగా అన్నాడు వాసుదేవరెడ్డి.

"గోడలకు చెవులుంటాయి, మా కెందుకీ రంపుల్లో యిరుక్కోడం పేదోళ్ళు ఏం మాట్లాడినా, అట్లాన్నావంటనే, యిట్లాన్నావంటనే అని నిలదీసి అడిగి మరీ కొట్టారు. నేపోతాబ్బా పెకు తెలి

ఘ్యుందేమ్యుంది. మీరే న్యాయం విచారించు కోండి'' అని గుఱ్రప్ప జారుకొన్నాడు.

పాపం లచ్చిగాన్ని బాగా కొట్టినారు రోకల బడెలతో. ఎప్పుడంటే అప్పుడు వాని దగ్గర లెక్క ఎక్కడు టాడు. పనికి యీ పొద్దు రాకుంటే రేపొస్తాడు. 'ఛ' పాడుపనులు. పనికిమాలినోళ్ళు అని అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

లచ్చిగాడు కేసుపెట్టినాడు. డాక్టరు కూడా దెబ్బల సర్టిఫికెటు బాగా నేయిచ్చినాడంట. ఊరంతా అబగుబలుగా ఉంది. 'పోలీసులు వూర్లోకి వస్తారు విచారించుకొంటారు. నేరస్తులను పట్టుకొని పోతారు' అని వూరంతా అనుకొంటున్నారు.

బాలిరెడ్డి కొడుకు వచ్చి "మా నాయన రమ్మంటున్నాడ"ని వాసుదేవరెడ్డికి చెప్పినాడు. పోకూడదనుకొంటూనే-పోకుంటే తీరదని - 'వస్తున్నా' అని చెప్పి పంపినాడు వాసుదేవరెడ్డి.

బాలిరెడ్డి యిల్లంతా కోలాహలంగా ఉంది. బాలపరిచే బంధువులందరినీ సమావేశ పరచినాడు. బంధువులంతా "ఆపసులో అంత అక్కసు పనికిరాదు. సన్నోళ్ళను అంతక్కసుగా కొట్టితే ఎట్లరా - బుద్ధిలేనిపని చేసినావు అందరూ మనమంనే అంటున్నారు. లచ్చిగానితో రంపు, లచ్చిగాని కొట్టడం సాకు పెట్టుకొని, మన శత్రువులు, మన గుంపును పుడమార్చాలని చూస్తున్నారు. ఆ తర్వాత యిది ఏ విధమైన రంపుల్లోకి దారి తీస్తుందో. అయినా మిడి మేళం పనికిరాదు. గామిడిగాడని 'వలుగు'రి నోళ్ళల్లో నానడం తప్పితే ఏమన్నా పుణ్యమ్మా పురుషార్థమూ. రూపాయకూ, అర్థరూపాయకూ పియ్యతినేవాళని జనోళ్ళు అదేపనిగా వాగుతారు. బంధువుల్లో తలవంపులు. సరిసమానమైన వాళ్ళతో సరసమైన, విరసమైన" అని అంటున్నారు "ఊర్లో పార్టీ పడుతుంది. యిది దానికి ఎత్తుమాసం" అని అంటున్నారు.

బాలిరెడ్డి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. 'లచ్చిగానికి దిక్కెవరో చూస్తాను. యిప్పుడు లచ్చిగాని కేసుతో పనేం. జరిగేది జరుగుతుంది. వానికి సాయపడే గంగిరెడ్డిగాని కతేందో తేలుతుంది చేనికాడ, చెట్టుకాడ ఎక్కడా వానితో రంపే. ఎంత ఒదుక్కొని పోవాలన్నా వానిది జాస్తిఅయింది. ఖర్చుఎంతయినా సరే" అని బాలిరెడ్డి రొప్పుతున్నాడు. వాసుదేవరెడ్డి అంతలో వచ్చినాడు. అతన్ని చూసి "నువ్వే చెప్పుమామా. వాడు లచ్చిగానికి సాయం పోవచ్చునా. నేను లెక్కిచ్చినా రాబట్టుకొంటా, వాన్ని కొట్టుతాను. చంపుతాను. ఎగదోసి వుసికొల్పుతాడా. గంగిరెడ్డో, నేనో - చావో బతుకో చూచుకొంటాం. మాకు వచ్చింది. మీకురాకుండాపోతుందా. వాడ సాధ్యుడు. ఎక్కడెక్కడి బీళ్ళల్లో మాన్లూ వాడే కొట్టుకొంటాడు చావిడికని కొట్టిన దంతెలు వాడే బండ్లమీద్దకూ వసారాకూ వేసుకోలేదా. ఊరకుంటే వూరంతా మేస్తాడు ఊరకుంటే వూరందర్ని తిప్పలు పెడ్తాడు. ఎక్కడెక్కడి

తకరార్లు వానికి కావాల. అందరికి తం పులు పట్టి వాడు పెద్దమనిషిగా తిరుగు తున్నాడు'', అని ఊగుతూ చెప్పినాడు బాలిరెడ్డి.

''అయినా దీనికి పార్టీ లెందుకురా'' అని అన్నాడు మందలింపుగా వాసుదేవ రెడ్డి

"నీకు తెలియదులే. వాన్ని ఎదుర్కో వలసిందే. లచ్చిగాని కేసు నా స్వంతం. మిగతా కేసులు, వస్తాయి. మీరంతా ఉండాల. లేకుంటే మితిమీరిపోతాడు. మీరు రాకుంటే నా స్వంతం నేనుచూచు కొంటా. సస్తే చస్తాను. బతికితే బతుకు తాను. అని అన్నాడు. ఏమైనా సరే నన్నట్లు బాలిరెడ్డి.

"తొందర పడకురా" అని వాసుదేవ రెడ్డి తాలచెప్పేందుకు ప్రయత్నించి నాడు.

"రెడ్డికర్నాన్ని లోబరుచుకొని ఎన్ని పనులు చేసినాడో మీకు తెలియదా. బీదోళ్ళను ఎన్నిసార్లు కొట్టినాడో ఊరం దరికి తెలుసు. వాడు కొట్టినప్పుడు నేను కేసు పెట్టినానా. వాని మాదిరీ నీచమైన పనులు మనం చేస్తామా. పోనీలే అని ఊరుకుంటే నన్ను రచ్చకీడుస్తాడా. నేను లచ్చిగాడి కాళ్ళు పట్టుకోవాలనా - వాని ఉద్దేశం. కేసు జరగనీ ఏమవు తుందో చూస్తాం" అని అన్నాడు బాలి రెడ్డి.

వాసుదేవరెడ్డి ఏమీ మాట్లాడకుండా కొంతసేపు వుండి అందరితోపాటు నేనూ అని అక్కడనుండి పోయినాడు.

ఆ రాత్రికి అంతా కట్టుదిట్టంగా గంగి రెడ్డికి ఎదురు పార్టీగా కట్ట మాట్టాడుకొని తిరుగుబాటు గాకుండా వుండేందుకు బాండ్లు వ్రాసుకొన్నారు. వాసుదేవరెడ్డి బాండు రాయించినాడు. ఆ రోజే ఏదో పని ఉందని కడపకు పోయినాడు. వాసు దేవ రెడ్డికి దంతా యిష్టంలేదు."తానేమీ చేయలేదు. అందరితోపాటు కచ్చలకు లెక్కలు పెట్టుకోవాల. భూస్వాముల కట్టలో తానూ ఒకడు. తప్పించుకోలేడు తనకూ ఆస్తి పాస్తులున్నాయి వాటికి రక్షణ ఉండదు. అందరితోపాటు ఉండ కపోతే పనికిమాలిన వాడైనా వాసుదేవ రెడ్డిని ముప్పుతిప్పలు పెట్టవచ్చు. పిల యితే యిరు పార్టీల వాళ్ళూ వాసుదేవరెడ్డి ఆస్తులకు నష్టం కలుగచేస్తారు. వాటం తప్పితే కొట్టడం కూడా జరుగుతుంది. అంతా దుర్మార్గుల మధ్య ఉన్నాడు. యింతకూ యీ ఆస్తిలేకపోతే యిదంతా లేదుకదా. న్యాయంకూడా చెప్పలేకుండా ఉన్నా" అని అనుకొన్నాడు వాసుదేవ రెడ్డి. "విధిలేని మంచితనం ఏం పని చేస్తుంది" అని కూడా అనుకొన్నాడు.

స్వంత కచ్చలతో కడప-మద్రాసు తిరుక్కుంటూ వూరికి పోకుండా తప్పిం చుకని తిరుగుతావున్నాడు. వూరికి పోయినా రాత్రిపూటలపోడం, ముఖ్య మైన పనులు పురమాయించడం - చేసి వస్తున్నాడు. యిదంతా కేసుల్లో తన్ను యిరికిస్తారనే ఉద్దేశంతోనే తప్పించు కొంటున్నాడు వాసుదేవరెడ్డి.

పార్టీలు రెండుగా స్పష్టంగా ఏర్పడి నాయి. యిరుగుపొరుగు ఊర్లకు ప్రాకింది

యూ గాత్ర. తోటలకాడ, దొడ్లకాడ, కళ్ళాలకాడ, ఆ గుంపులోనూ, ఈ గుంపులోనూ ఉన్న కట్టె పట్టేవాళ్ళు మన పార్టీ తగ్గిపోతే ఎట్లా – ఎళ్ళకోమను సదరానికి తెలుస్తాది" అని పరస్పరం తెలిసేట్లు బీరాలు పలుకుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల పిడిగుద్దులూ కొట్లాటలూ, లేనిపోని సాకులు పెట్టి సేద్యగాళ్ళను కొట్టడం జరుగుతావుంది. చిలికి చిలికి గాలివాన అవుతావుంది. పార్టీలో వాళ్ళు రెండుగుంపుల వాళ్ళూ ఎక్కడికి పోయినా జట్లుజట్లుగా, మొల్లో బాకులతో పోతూవున్నారు. యారముట్లూ, కావలసిన తుపాకులూ తెచ్చిపెట్టుకొన్నారు. ఎప్పుడైనా తలపడ వచ్చునని పోలీసోల్లు జామీన్ కేసులు బనాయించినారు. వాయిదాలకు తిరుగుతున్నారు. డబ్బులు కర్చయితా ఉన్నాయి. వూర్లో ఏ యింటి కాడ తకరారూ ప్రధానంగా చర్చల్లోకి వస్తూనే ఉంది.

నెల తిరక్కతలికే వూరిలో ఖూనీలు పడినాయి. వాసుదేవరెడ్డికి దిక్కు తెలియలా. విధిలేక ఊరికి వచ్చినాడు. బాలిరెడ్డి గుంపులోనే ఒకడు ఎందుకూ పనికిరానోడు ఖూనీ అయినాడు. మిద్దెలెక్కి తుపాకుల్తో కాల్చుకొన్నారు. ఖూనీలు జరిగిననాడు ఊర్లో లేనోల్లను తప్ప అందరినీ – ముఖ్యమైనోళ్ళను – కేసులో యిరికించినారు. అంతా తెలుసుకొన్నాడు వాసుదేవరెడ్డి. ఏంచేస్తాడు. బాలిరెడ్డి యింటికి పోయినాడు.

"అయిందేదో అయింది. యిప్పుడే మంచి అవకాశం. నేను చెప్పలా వాడు దుర్మార్గుడని. వూరంతా నాశనం చేయాలని చూసినాడు. ఆ దినం కాల్పుల్లో వూరంతా అట్టుడికినట్లు ఉడికింది. కాల్పుల్లో ఏమీ కాబట్టనోడు మన రామిరెడ్డన్న సేద్యగాడు గుర్రప్పచచ్చినాడు. వాన్నెందుకు కాల్చినారో తెలియదు. ముండనా కొడుకులు. మమ్మల కాల్చకూడదా. అందరం కట్టుదిట్టంగా ఉండి వాన్ని – గంగిరెడ్డిగాన్ని నామరూపాలు లేకుండా చేయాల"–అని అన్నాడు బాలిరెడ్డి.

ఊరంతా పుండు మాదిరి పాసిపోతా ఉంది. పార్టీ లీడర్లు రక్షణకు మనుషుల్ని వెంట పెట్టుకొని తిరుగుతున్నారు. రెండు గుంపులూ న్యాయంకోసం పోరాడుతున్నారు. లచ్చిగానితో వచ్చిందంతా అని ఎక్కడ పడితే అక్కడ అనుకొంటున్నారు. లచ్చిగాడు వూర్లోలేడు. పొరుగూరికి పోయి పనులకు పోతా బతుకుతున్నాడు. ఎప్పుడైనా వాయిదాకు పోయి వస్తూంటాడు. వానికేసు సంగతి సందర్భాల ఎవరికీ కాబట్టలేదు. గంగిరెడ్డికి ఖూనీకేసు వచ్చి మీద పడింది. సముద్రము యీదినట్టుంది. బాలిరెడ్డి గుంపు వాళ్లు జాగ్రత్తగా గంగిరెడ్డి గుంపును జైలుకు పంపాలని కేసు విషయాలు చూచుకొంటున్నారు.

"గాడిదిని చంపి గల్లుకు పోవడం దేనికిరా. చెప్తే వినరు. అనవసరంగా అక్కసలకుపోయి కొంపకు చేటు తెచ్చుకొన్నారు. కేసు సరిగ్గా నడిస్తే కనీసం పదిమందికైనా యావజ్జీవ కారాగారం చెప్తాదు. కొంపలు గునామల్తో కూడా

లేసిపోతాయి. కూనీ కేసులంటే సన్నపనా. వకీళ్ళూ, పోలీసోళ్ళూ మేస్తారు; యింతకూ న్యాయం జరుగుతుందా. జరగదు. కాల్చిందేవ ఒకడే అయినా పదిమంది జైలుకుపోవాల. ఆడోళ్ళకూ, పిల్లోళ్ళకు దిక్కెవరు. భూములూ, యిళ్లూ దిక్కులేకుండాపోతాయి. సేద్యం సరిగా జరగదు. అన్నీ యిబ్బందులే. చెప్తే వినరు యిప్పుడైనా మించి పోలేదు. రాజీపడితే మనకు మేలు. జైలు తప్పుతుంది"- అని గంగిరెడ్డి బంధువులు కొంతమంది గంగిరెడ్డికి చెప్పుతున్నారు. బాలిరెడ్డికీ, బాలిరెడ్డి బంధువులు రాజీపడమని చెప్పుతున్నారు "పిల్లపిల్ల పస్యతమూ యీ రోషానపోవు. మనమై తెచ్చిపెట్టినట్లుంది. ఆడోళ్లకు పిల్లోళ్లకూ కష్టం. లెక్కలు పోతాయి. ఎందుకీ పగ. వాళ్ళు జైలుకు పోతే మనకేమొస్తుంది. అందులో ఏమీ తెలియనోళ్ళను, కాబట్టనోళ్ళను కేసులో పెట్టినారు. వాళ్లకు అక్కసలు వస్తాయి. ఏమైనా రాజీపోతే మంచిది" అని,

రెండు గుంపుల్లోనూ యువకులు రాజీమాటలు చెప్తేనే మెడ గరుసుకొంటున్నారు. వాళ్ళు రాజీ పోయేది యిష్టపడటం లేదు," యింత దూరం వచ్చినాం. వాళ్ల నాశనం కావకమో, మేం నాశనం కావకమో జరుగుతుంది. జరగనీ" అని అంటున్నారు. రాజీకి వప్పుకోకుండా వున్న వాళ్ళంతా, కేసులో లేనోళ్లే. పార్టీకి కట్టెపట్టేవాళ్లు. అంతే. పార్టీ అన్నాక అందరి మాటలువినాలి. వినకుంటే కూడా చిక్కులు వస్తాయి. రాజీప్రయత్నాలు చెయ్యాలని పార్టీ ముఖ్యులు అనుకోలేకపోతున్నారు. పనికిమాలిన న్యాయ ధర్మాలు అడ్డువస్తున్నాయి. పూరి మేలు గోరి రాజీ పోవాలన్న భావమే అందరి మనసులోనూ మెదల్తావుంది. అందరికీ లెక్కలు పోతాయి. ఆస్తులు కరుగుతాయి.

పెద్దపెదవాళ్లూ, యిరుపార్టీలకు సంబంధించిన రాజకీయవాదులూ. బంధువులూ, పరిసరగ్రామ పెద్దలూ, అందరూ రాజీ పొండని చెప్పుతున్నారు. ఎవరితో కదిపినా, "ఇప్పుడు సల్లుకుంటామా. పోతే పోతుంది రెండేళ్ళ పైరు. అని బాలిరెడ్డి గుంపులో కుర్రకారు రాజీకి ఒప్పుకోవడంలేదు. యిరుపార్టీల గుంపుల్లో కొన్ని కుటుంబాలు ఒకరికొకరు బంధువులు - దగ్గర బంధువులు ఆ దవాళ్ళ ద్వారా లోపల్లోపల రాజీ మాటలు జరుగుతున్నాయి. రాజీకి ఒప్పించేందుకు వాళ్లూ తీవ్రంగా ప్రయత్నిస్తూన్నారు.

కేసు బలం తగ్గకుండా బాలిరెడ్డి గుంపు తీవ్రంగా ప్రయత్నిస్తూవుంది కేసు తోసిపొయ్యేట్లు చేయవలసిన ప్రయత్నాలన్నీ గంగిరెడ్డి గుంపు వాళ్ళూ ప్రచండంగా ప్రయత్నిస్తున్నారు. యథావిధిగా ఎక్కువ మోతాదులో లెక్కలు కర్చవుతున్నాయి. అడ్డు పడినోళ్లల్లా ఆదరించి పంపాల్సివుంది. అందరినీ మేపాల. నైతికంగా బలపరిచేవాళ్ళనూ మేపుకుంటూరావాల. ఆయకాలు రాయించి అప్పులు తెచ్చుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి కొందరికి. "పార్టీ బాగొచ్చి

పడెనే పాడుపడ" అని అనుకొంటున్నారు కొందరు. పెద్ద మనుషులు ప్రతి నిత్యమూ రాజీకి ప్రయత్నిస్తున్నారు. ప్రతివానినోటా "ఆస్తులుపోతాయి. అడుక్కోవలసి వస్తుంది. రాజీపోతేమంచిది. మా మాట వినండి" అని నొక్కుతున్నారు.

కడాకు రాజీ కుదిరింది. 10 వేల లెక్క బాలిరెడ్డి గుంపుకు యిచ్చేట్లుగా, ఉత్తరోత్తరా తిరిగీ కొట్లాటలు రాకుండేందుకు బాలిరెడ్డి కూతుర్ని గంగిరెడ్డి మేనల్లునికిచ్చి వివాహం చేసేట్లు కుదరపలుక్కొని రాజీ జరిగింది, విశ్వ ప్రయత్నమైంది రాజీ కుదిరించేందుకు. అందరు పెద్ద మనుషులూ తీవ్రంగా ప్రయత్నించినారు. సాక్ష్యాలు తప్పు పలికేటట్లు కట్టుదిట్టంగా మాటలు జరిగినాయి న్యాయవాదులూ, పోలీసోళ్ళు, అందరూ రాజీకి సహకరించినారు. వాళ్ళదేంపోతుంది. వాళ్ళకు ముట్టాల్సింది ముట్టింది. కూనీ అయిన గుర్రప్ప భార్యకు రు 3000/- లెక్క యిచ్చినారు. సాక్ష్యం తప్పుబలికిచ్చినారు. సంపాదించే మొగుణ్ణి పోగొట్టుకొని ముష్టిమూడువేలు తీసుకొని 'శివు శా' అని వూరు విడిచిపోయింది.

"పోనీ రేబ్బా రాజీ కుదిరింది. యింక నన్నా బాగుంటారు" అని అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

లచ్చిగాని కేసేమయిందో ఎవనికీ తెలియదు.

## కొత్త జీవితం

ఆకాశంలో
సూర్యుడు వెలుగుతున్నాడు,
కానీ
అంతా చీకటే-
కంకర రాళ్ళను భుజించి
తారును తొడుక్కొన్నది రోడ్డు:
కానీ
దారిపొడుగునా గతుకులూ, ముళ్ళే-
నవ్వుకుంటూ
జీవిస్తున్నాడు మనిషి;
కానీ
గుండెనిండా బాధలగాయాలే-
చీకట్లలో,
ముళ్ళలో,
గాయాలతో
సుస్తీగా జీవిస్తున్న
ఈ సమాజం తిర్గి
ఆరోగ్యం పొందాలంటే-
పిడికిలి బిగించే వాని
చెమటతో, రక్తంతో
తయారు చేసిన
సరికొత్త టానిక్కు తప్పనిసరి-

—జూకంటి జగన్నాథం